బాబు ష్యూరిటీ.. బాదుడు గ్యారంటీ

- మాజీ ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన హోరు
- పెంచిన రేట్లు తగ్గించాలని డిమాండ్
- అధికారులకు వినతిపత్రాలు అందజేత
- తరలివచ్చిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



రాజానగరంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట బైఠాయించిన మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, పార్టీ శ్రేణులు



దుప్పలపూడిలో ఏఈకి వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి తదితరులు



రాజానగరంలో విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: బాబు ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారంటీ అంటూ ఎన్నికల సమయంలో ప్రచారం నిర్వహించి అధికారంలోకి వచ్చిన కూటమి... ఇప్పుడు బాబు ష్యూరిటీ.. బాదుడు గ్యారెంటీ అనేలా పాలన సాగిస్తోందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి అన్నారు. రాష్ట్రంలో విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ, వైఎస్సార్ సీపీ అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు నియోజకవర్గ కేంద్రమైన రాజానగరంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం వైఎస్సార్ సీపీ పోరుబాట కార్యక్రమం నిర్వహించింది. నియోజకవర్గంలోని సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండలాల నుంచి భారీగా పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. విద్యుత్ చార్జీల బాదుడు బాధితులతో కలసి వీరందరూ స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి గాంధీ బొమ్మ సెంటర్, బస్టాండ్ ఏరియా, పోలీసు స్టేషన్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌కు చేరుకుని, అక్కడ బైఠాయించారు. విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

మాట తప్పిన చంద్రబాబు: జక్కంపూడి రాజా

జక్కంపూడి రాజా మాట్లాడుతూ అధికారంలోకి వస్తే ఒక్క రూపాయి కూడా విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పిన మాటలను చంద్రబాబు అండ్ కో మర్చిపోయారా అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ అంటూ పథకాలను ప్రకటించిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చి ఏడు నెలలు కావొస్తున్న వాటి మాటే ఎత్తడం లేదన్నారు. ప్రజలను ఏమారుస్తూ సూపర్ సిక్స్ పేరిట మద్యం బాటిళ్లను మార్కెట్‌లోకి తీసుకువచ్చారన్నారు. దానినే ఆయన ఇచ్చిన హామీగా భావించాలా అని అడిగారు. పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని, డిమాండ్ చేశారు. అనంతరం విద్యుత్ శాఖ ఏఈ సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు దూలం పెద్ద, గంటా శ్రీనివాస్, అడపా కనకరాజు, కో కన్వీనర్లు గండి నానిబాబు, కరుటూరి హరిబాబు, గణేశుల పోశయ్య, జెడ్పీటీసీ సభ్యులు వాసంశెట్టి పెద వెంకన్న, కర్రి నాగేశ్వరరావు, సీతానగరం ఎంపీపీ గుర్రాలు జ్యోత్స్న, మార్కెట్ కమిటీ చైర్మన్ నక్కా రాంబాబు, నాయకులు మేడా గురుదత్త ప్రసాద్, గంగిశెట్టి సోమేశ్వరరావు, అనదాస సాయిరామ్, మండారపు వీర్రాజు, అడబాల చినబాబు, ఉల్లి బుజ్జిబాబు, డాక్టర్ బాబు, చల్లమళ్ల సుజీరాజు, వేమగిరి కృష్ణ, నాళం రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలు తక్షణం తగ్గించాలి

పెదపూడి: పేద ప్రజల నడ్డివిరిచే విధంగా చంద్రబాబు సర్కారు పెంచిన విద్యుత్ చార్జీలు తక్షణం తగ్గించాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నియోజకవర్గ కేంద్రమైన అనపర్తిలో వైఎస్సార్ సీపీ శ్రేణుల ఆధ్వర్యంలో ఎన్డీఏ ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా పెద్దఎత్తున ధర్నా, ఆందోళన చేపట్టారు. పార్టీ కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డులో దేవీచౌక్ సెంటర్ మీదుగా దుప్పలపూడి గ్రామం వరకు పార్టీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. అక్కడ సబ్‌స్టేషన్‌లో ఏఈకి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణ రెడ్డి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ, పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించే వరకు ప్రజల పక్షాన వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తుందన్నారు. విద్యుత్ చార్జీలు ఒక్క రూపాయి పెంచబోమని ఎన్నికలకు ముందు ఎన్డీఏ కూటమి నేతలు ఇచ్చిన హామీని విస్మరించి, అధికారంలోకి వచ్చాక పెద్దఎత్తున విద్యుత్ చార్జీలు పెంచారని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రూ.15 వేల కోట్లకు పైగా భారాన్ని ప్రజలపై మోపారని దుయ్యబట్టారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వ అరాచకాలపై పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రజల పక్షాన నిరంతర పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొల్లాటి ఇజ్రాయేలు, రంగంపేట, అనపర్తి, పెదపూడి జెడ్పీటీసీ సభ్యులు పేపకాయల రాంబాబు, సత్తి గీతా వరలక్ష్మి, పేపకాయల వెంకటలక్ష్మి, పెదపూడి, బిక్కవోలు మండలాల కన్వీనర్లు గుత్తుల వెంకటరమణ, పోతుల ప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, అనపర్తి గ్రామ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన్ బాలకృష్ణారెడ్డి, సర్పంచ్ వారా కుమారి, పార్టీ జిల్లా కార్యదర్శి, కొంకుదురు ఎంపీటీసీ పడాల వీరవెంకట సత్యనారాయణ(పీవీ), ద్వారంపూడి సూర్యనారాయణరెడ్డి, సమ్మంగి దుర్గాప్రసాద్, సాంబత్తుల చంటి, గాజంగి వరదాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

లోక రక్షణకే క్రీస్తు జననం



దుప్పలపూడి మరనాత చర్చిలో మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణ రెడ్డిని సన్మానిస్తున్న పాస్టర్, పెద్దలు



బూరుగుపూడిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఫాదర్ మనోజ్ కుమార్, బెంజిమన్

పెదపూడి: కరుణామయుడు ఏసుక్రీస్తు లోక రక్షణ కోసమే జన్మించారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తి మండలం దుప్పలపూడి గ్రామంలో మరనాత మందిరం పాస్టర్ బి.మార్టిన్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే కేక్ కట్ చేసి, అందరికీ కేక్, స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ క్రీస్తు బోధించిన ప్రేమ, దయ, కరుణతో జీవించాలన్నారు. ముందుగా భక్తులు కొవ్వొత్తులు చేతపట్టి ప్రత్యేక కీర్తనలు పాడారు. అనంతరం డాక్టర్ సూర్యనారాయణరెడ్డిని పాస్టర్, సంఘ పెద్దలు ఘనంగా సత్కరించారు.

ఐక్యతగా జీవించాలి

బిక్కవోలు: ప్రతి ఒక్కరూ ఐక్యత, ప్రేమతో నిజాయతీగా జీవించాలని పాస్టర్ డాక్టర్ ఎం ఆశీర్వాదం అన్నారు. శుక్రవారం బలభద్రపురంలో జైభీమ్ యూత్ ఆధ్వర్యంలో యూత్ క్రిస్మస్ నిర్వహించారు. చిన్నారుల నృత్యాలు, కేండిల్ సర్వీస్, క్రిస్మస్ తాత వేషధారణలు ఆకట్టుకున్నాయి. అనంతరం కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఏసుక్రీస్తు జననం.. మానవాళికి పర్వదినం

మధురపూడి: ఏసుక్రీస్తు జననం.. మానవాళికి పర్వదినమని ఆర్‌సీఎం ఫాదర్ మనోజ్ కుమార్ అన్నారు. కోరుకొండ మండలం బూరుగుపూడిలోని ఆర్‌సీఎం చర్చి ఆవరణలో శుక్రవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మనోజ్ కుమార్ మాట్లాడుతూ విశ్వాసం, ప్రేమ, కరుణ, దయ, నిరీక్షణ అనే సందేశాలతో లోకానికి కొత్త మార్గాన్ని క్రీస్తు చూపించారన్నారు. బెంజిమన్ మాట్లాడుతూ పాపాల నుంచి మానవాళి విముక్తి కోసం దివి నుంచి భువికి దిగి వచ్చిన ఆయనను పూర్ణ హృదయంతో ఆరాధించాలన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల గీతాలాపనలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం వృద్ధులు, వితంతువులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొల్లి జాకబ్, రాయి థామస్, రత్నం, సుబ్బారావు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యం

- వాటాలపైనే పాలకుల దృష్టి
- విలేకరులతో మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: నియోజకవర్గంలో అభివృద్ధి జరగడం లేదని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఆయన రాజానగరంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఇక్కడ ఉన్న పాలకులకు వాటాలే కావాలని, ప్రజల బాగోగులతో పనిలేదన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న గడచిన ఐదేళ్లలో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టానన్నారు. వాటిలో కొన్ని ఎన్నికల కారణంగా మధ్యలోనే నిలిచిపోయాయన్నారు. రూ.91 కోట్లతో తొర్రిగడ్డ రివర్స్ పంపింగ్ స్కీమ్, రూ.38 కోట్లతో మైనర్ ఇరిగేషన్ స్కీమ్, రూ.215 కోట్లతో ఇంటింటికీ గోదావరి జలాల పంపిణీ ప్రాజెక్టు, సీతానగరంలో ప్రభుత్వాస్పత్రి అప్‌గ్రేడేషన్.. ఇలా అనేక పథకాలు తీసుకువచ్చానన్నారు. ఇప్పుడు వాటి గురించి పట్టించుకునే తీరికే లేనట్టుగా ప్రస్తుత ఎమ్మెల్యే తీరు ఉందన్నారు. అభివృద్ధి కోసం కొత్తగా నిధుల కోసం కృషి చేయాల్సింది ఏమీ లేదని, తాను తెచ్చిన పథకాలను పూర్తి చేయించగలిగితే చాలన్నారు. కానీ ప్రస్తుతం ఆ విధంగా జరగడం లేదని, పర్సంటేజీలు మాట్లాడుకుంటూ బేరం కుదరకపోతే ఆ పనుల గురించి పట్టించుకోవడం లేదన్నారు. ఈ కారణంగానే నియోజకవర్గంలో ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు అటకెక్కాయని, రోడ్ల అభివృద్ధి జాడే లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా పనులు చేసే కాంట్రాక్టర్లను పిలిచి పర్సంటేజీలు డిమాండ్ చేస్తున్నారన్నారు. అలాగే గోదావరిలో ఇసుక, చెరువుల్లో మట్టి, మద్యం దుకాణాలు, మున్నగు వాటి నుంచి కాసులు పిండేస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో రూ.60 కోట్లు పైబడి ఖర్చయింది, ఇదంతా వసూళ్లు చేసుకోవాలి కదా అంటూ వీఆర్వో నుంచి తహసీల్దారు వరకు జరిగే బదిలీలు, పోస్టింగ్‌లకు కూడా రేట్లు పెట్టి వసూళ్లు చేస్తున్నారని ప్రస్తుత ఎమ్మెల్యే తీరుపై ఆరోపణలు గుప్పించారు.

ఒక్క మోటారు నుంచే సాగునీరు విడుదల

సాక్షి ఇంపాక్ట్

సీతానగరం: మండలంలోని రాపాక వద్ద ముంపులోకి వెళుతున్న పొలాలను దృష్టిలో ఉంచుకుని ఒక మోటారు ద్వారా 120 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేశామని జలవనరులశాఖ ఏఈ శివ రామకృష్ణ శుక్రవారం తెలిపారు. సాక్షి పత్రికలో గురువారం 'ముంపు నీట... పంట', అలాగే శుక్రవారం 'ముంపు బారిన బీర పాదులు' అనే శీర్షికలతో వచ్చిన కథనాలకు ఆయన స్పందించారు. ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ టీపీ స్కీమ్ నుంచి రెండు మోటార్ల ద్వారా 240 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేశామని, అయితే ముంపులోకి పంటపొలాలు వెళ్లడంతో ఉదయం 8.30 గంటల నుంచి ఒక్క మోటారు ద్వారా 120 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేయడం జరిగిందన్నారు. మధ్యాహ్నం నుంచి సాగునీరు విడుదల పెంచాలని ఇతర గ్రామాల రైతులు నుంచి ఒత్తిడి పెరిగిందన్నారు. దీనితో శనివారం ఉదయం నుంచి తిరిగి రెండు మోటార్లు ద్వారా సాగునీటిని విడుదల చేస్తామని, ముంపులోకి వెళ్లే పంటల గట్లను రైతులు మరింత పటిష్టంగా ఉంచుకొని, ముంపులోకి వెళ్లకుండా తగు చర్యలు రైతులు తీసుకోవాలని ఏఈ శివ రామకృష్ణ కోరారు.

విజయదుర్గ అమ్మవారికి పంచామృతాభిషేకాలు



ప్రత్యేకాలంకరణలో విజయదుర్గ అమ్మవారు

పెదపూడి: సంపర గ్రామంలో ఉన్న విజయదుర్గ అమ్మవారికి పంచామృతాభిషేక పూజలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఆలయ అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు హాజరై లలితా పారాయణం చేశారు. అనంతరం నీరాజన మంత్ర పుష్పాలు, అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

31న మండల పరిషత్ సమావేశం

రంగంపేట: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం ఈ నెల 31వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ వి.వీర సాయిబాబు శుక్రవారం తెలిపారు. ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి అధ్యక్షత వహిస్తారని చెప్పారు. ఎమ్మెల్యేతో పాటు, మండలంలోని ప్రజాప్రతినిధులు హాజరవుతారన్నారు. మండల స్థాయి అధికారులు పూర్తి నివేదికలతో హాజరుకావాలని కోరారు.

నేడు నల్గొండలో సదస్సు

సీతానగరం: మండలంలోని నల్గొండలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ రికార్డు వర్కు ఉన్నందున శుక్రవారం సభ నిర్వహించలేదన్నారు. ఆ గ్రామంలోని కమ్యూనిటీ హాల్లో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. భూ సమస్యలపై రైతులు అర్జీలు పెట్టుకోవాలని సూచించారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్ట్

సీతానగరం: రఘుదేవపురం శివారున పేకాడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేశామని హెడ్ కానిస్టేబుల్ వాసంశెట్టి శ్రీను శుక్రవారం తెలిపారు. వారి నుంచి రూ.550 స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరుపర్చుతామన్నారు.

కాపవరంలో స్థల పరిశీలన



కాపవరంలో స్థలాన్ని పరిశీలిస్తున్న జేసీ

బిక్కవోలు: మండలంలోని కాపవరం గ్రామంలో జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు స్థల పరిశీలన చేశారు. ఏపీఐఐసీ ద్వారా చెత్త నుంచి బయోగ్యాస్ తయారీ యూనిట్ల ఏర్పాటుకు శుక్రవారం ఆయన స్థలాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సుమారు 11 ఎకరాలు అవసరమని, కాపవరం గ్రామంలో బలభద్రపురం-రాజానగరం రోడ్డులో ఉన్న స్థలాన్ని ఇందుకు పరిశీలించామన్నారు. ఆయన వెంట ఆర్డీవో కృష్ణ నాయక్, తహసీల్దార్ బీవీవీ సత్య కృష్ణ ఉన్నారు.

హనుమ వాహనంపై స్వామి గ్రామోత్సవం



హనుమ వాహనంపై విహరిస్తున్న స్వామివారు

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురంలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు హనుమ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం ఘనంగా జరిగింది. శుక్రవారం ఉదయం సుప్రభాత సేవ, లఘుఅర్చన, తోమాల సేవ, గోపూజ. పవళింపు సేవ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం స్వామివారికి హనుమ వాహనంపై గ్రామోత్సవం జరిగింది.

మన్మోహన్‌సింగ్ సేవలు చిరస్మరణీయం



రాజానగరంలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న జక్కంపూడి రాజా తదితరులు



అనపర్తి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మన్మోహన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సూర్యనారాయణరెడ్డి

రాజానగరం: మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా, వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ కన్వీనర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. రాజానగరంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నివాళితో ముగిసిన సమావేశం

స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశాన్ని మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్‌కు నివాళి అర్పించి ముగించారు. ఎంపీపీ మండారపు సీతారత్నం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎటువంటి తీర్మానాలు చేయకుండానే మాజీ ప్రధాని మృతికి సంతాపాన్ని ప్రకటించి, సమావేశాన్ని ముగించారు. ఉపాధ్యక్షురాలు కొల్లి సత్య, ఎంపీడీఓ జేఏ ఝూన్సీ, సూపరింటిండెంట్ సుబ్రహ్మణ్యం, వివిధ ప్రభుత్వ శాఖ అధికారులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ప్రధానికి నివాళులర్పించారు. మండల అధ్యక్షుడు గుడ్డుబోగుల శ్రీనివాస్ (రంగా శ్రీను) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అయిల శేషగిరి, మోర్త అబ్బులు, దుళ్ల సూర్యనారాయణ, పిర్ల గణేష్, మట్ట రాము తదితరులు పాల్గొన్నారు.

దేశానికి మన్మోహన్ విశేష సేవలు

పెదపూడి: ప్రధానిగా దేశానికి మన్మోహన్‌సింగ్ అలుపెరగని, విశేష సేవలందించారని, ఆయన మృతి దేశానికి తీరని లోటు అని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ అనపర్తి కార్యాలయంలో శుక్రవారం మన్మోహన్‌సింగ్ మృతికి శ్రద్ధాంజలి ఘటించి, ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ, ప్రపంచ మేధావిగా ఆర్థిక మంత్రిగా మన్మోహన్‌సింగ్ ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు దేశానికి ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. అనపర్తి ఏఎంసీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, పార్టీ నాయకులు అద్దంకి ముక్తేశ్వరరావు, కొల్లాటి ఇజ్రాయేలు, గుత్తుల వెంకటరమణ, పోతుల ప్రసాద్ రెడ్డి, నల్లమిల్లి మురళీమోహన్ బాలకృష్ణారెడ్డి జెడ్పీటీసీలు పేపకాయల రాంబాబు, సత్తి గీతావరలక్ష్మి, పేపకాయల వెంకటలక్ష్మి, ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, సర్పంచ్ వారా కుమారి పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్‌కు ఎమ్మెల్యే నివాళి

పెదపూడి: ఆర్థిక వేత్తగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ దేశానికి అందించిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తి మండలం రామవరం గ్రామంలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి ఆయన నివాళులర్పించారు. అదేవిధంగా జి.మామిడాడ గ్రామీణ ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించి, వైద్యులు, సిబ్బందితో మాట్లాడారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు.

క్లుప్తంగా

నేటి నుంచి తెలుగు మహాసభలు

రాజానగరం: విజయవాడలో శని, ఆదివారాలలో జరిగే ప్రపంచ తెలుగు మహాసభలకు ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని తెలుగు విభాగం అధ్యాపకుడు డాక్టర్ తరవట్ల సత్యనారాయణ విశిష్ట అతిథిగా హాజరుకానున్నారు. కనుమరుగవుతున్న మన జానపద కళా సంపద పరిరక్షణ – ప్రణాళికలు అనే అంశంపై ఆయన ఉపన్యసిస్తారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



పందలపాకలో వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

బిక్కవోలు: పందలపాక గ్రామంలోని తుల్యభాగ నదీ తీరాన కొంకుదురు రోడ్డులో వెలిసిన అలివేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణం ఘనంగా నిర్వహించారు. గురువారం రాత్రి మార్గశిర మాసం ఏకాదశిని పురస్కరించుకుని స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, కుంకుమార్చన, అనంతరం కల్యాణాన్ని అర్చకులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేకాలంకరణ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ సత్తి సత్తిరెడ్డి అన్న సమారాధన నిర్వహించారు.

చింతపల్లిలో రోడ్డుపై కూలిన వృక్షం



చెట్టును తొలగించే చర్యలను పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ

పెదపూడి: జి.మామిడాడ-రామచంద్రపురం ఆర్‌అండ్‌బీ రోడ్డులో చింతపల్లి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద శుక్రవారం సాయంత్రం రోడ్డు పక్కనున్న తురాయి చెట్టు రోడ్డుకు అడ్డంగా కూలింది. ఆ సమయంలో రోడ్డుపై ప్రయాణికులు, వాహనాలు లేకపోవడం ముప్పు తప్పింది. ఈ ఘటనతో రోడ్డుపై వాహనాల రాకపోకలు స్తంభించాయి. సమాచారం తెలుసుకున్న ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి అక్కడకు చేరుకుని, స్థానికులు, గండ్రేడు పంచాయతీ క్లాప్ మిత్రాల సహకారంతో వృక్షాన్ని కట్ చేసి తొలగించారు. సుమారు రెండు గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

గ్యాస్ లీక్‌తో అగ్ని ప్రమాదం



ఊలపల్లిలో మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

బిక్కవోలు: ఊలపల్లి గ్రామంలో ఓ ఇంట్లో గ్యాస్ లీకై అగ్ని ప్రమాదం సంభవించింది. గ్రామానికి చెందిన ఓదూరి బాపిరాజు వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికొచ్చాడు. వేడినీళ్లు కాచడానికి గ్యాస్ స్టౌ ఆన్ చేయడంతో, మంటలు ఎగసిపడ్డాయి. స్థానికులు అపాయాన్ని గమనించి, మంటలార్పేందుకు విఫలయత్నం చేశారు. ఈ ప్రయత్నంలో ఒకరి చేతులకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న అనపర్తి ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి సిబ్బందితో అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. కొన్ని సామాన్లు కాలిపోవడంతో, సుమారు రూ.30 వేల ఆస్తి నష్టం వాటిల్లినట్టు ఫైర్ ఆఫీసర్ తెలిపారు.

మామిడిలో చీడపీడలను నివారించాలి

బిక్కవోలు: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో మామిడి తోటల్లో చీడపీడలను నివారించాలని ఉద్యాన అధికారి కె దివ్యశ్రీ అన్నారు. శుక్రవారం ఆమె రంగాపురం గ్రామంలోని మామిడి రైతులతో మాట్లాడారు. మామిడి తోటలు, పూమొగ్గ, పచ్చిపూత, పూత దశల్లో ఉన్న దృష్ట్యా ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం రసం పీల్చే పురుగులు, తెగుళ్ల ఉధృతి ఉండే అవకాశం ఉందన్నారు. రైతులు తోటల్లో చీడపీడలను నివారించాలన్నారు. మామిడి తోటలు పూమొగ్గ దశలో ఉంటే, తేనె మంచు పురుగులు, పక్షికన్ను, బూడిద తెగుళ్ల నివారణ ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ., క్లోరథలోనిల్ 2.మి.లీ.ను లీటరు నీటికి కలిపి చెట్టు ఆకులు, కాండంపై పిచికారీ చేయాలన్నారు. ప్రస్తుతం తోటకు నీరందించడం నిలిపి వేయాలన్నారు. తోటల్లో కలుపు లేకుండా ఉంచుకోవాలని సూచించారు.

సస్యరక్షణ చేపట్టాలి

రంగంపేట: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో మామిడి తోటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల ఉద్యానవన అధికారి కె.దివ్యశ్రీ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ, మామిడి తోటలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ప్రస్తుతం పురుగులు, తెగుళ్ల ఉధృతి ఉండవచ్చని, సస్యరక్షణ చర్యలు కీలకమన్నారు.